సాక్షి
మంచిర్యాల

సోమవారం। 25। డిసెంబర్। 2023

గరిష్టం/కనిష్టం
31.1 /14.2

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత సాధారణంగా నమోదవుతుంది. రాత్రి ఉష్ణోగ్రత బాగా తగ్గుతుంది. మంచు ఎక్కువగా కురుస్తుంది. చలి ఎక్కువగా ఉంటుంది.



రామకృష్ణాపూర్‌లో ఏర్పాటు చేసిన సెట్టింగ్‌..



భీమారంలో కేక్‌ కట్‌చేస్తున్న క్రైస్తవులు

జిల్లాలో క్రిస్మస్‌ వేడుకలు ప్రారంభమయ్యాయి. సోమవారం క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవాలయాలను విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని వివరించేలా చర్చిల ఆవరణలో ప్రత్యేక సెట్టింగులు వేశారు. రాత్రి ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు.

- వివరాలు 8,9లో▸

న్యూస్‌రీల్‌

సీఎం సమీక్షలో కలెక్టర్, అదనపు కలెక్టర్




కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్

నస్పూర్: హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఆయా కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్ హాజరయ్యారు. ఆరు గ్యారెంటీల అమలు, అర్హుల ఎంపిక తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

మందమర్రిరూరల్: మానవ అక్రమ రవాణా, మహిళా సాధికారతపై స్థానిక బాలికల వసతి గృహంలో నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కల్పించారు. జిల్లా అథారిటీ చీఫ్ డిఫెన్స్ కౌన్సిలర్ సందాని బాలికలకు అవగాహన కల్పించారు. మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సొసైటీలో జరుగుతున్న మోసాలను తెలియజేశారు. అనంతరం బాలికలకు రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ విజయలక్ష్మి, డిస్ట్రిక్ట్ అథారిటీ డిప్యూటీ చీఫ్ డిఫెన్స్ కౌన్సిలర్ ఎండీ.తాజొద్దీన్, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిలర్ సబ్బని సదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీకే మద్దతు తెలిపిన టీఎన్టీయూసీ



ఎమ్మెల్యేలతో టీఎన్టీయూసీ నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణి ప్రైవేటీకరణ అడ్డుకునే సత్తా ఐఎన్టీయూసీకే ఉందని, గుర్తింపు ఎన్నికల్లో ఆ సంఘానికే మద్దతు ఇస్తున్నట్లు టీడీపీ అనుబంధ టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ తెలిపారు. ఏరియా ఆఫీస్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు గడ్డం వివేక్ వెంకటస్వామి, వినోద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడారు. టీఎన్టీయూసీ మద్దతు తెలుపడం సంతోషకరమన్నారు. సింగరేణిలో కార్మిక హక్కుల సాధన, సింగరేణి పరిరక్షణ కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. యాజమాన్యంతో కార్మికులకు సమస్యలు ఎదురైతే పోరాటానికి ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, టీఎన్టీయూసీ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు మణిరాం సింగ్, నారాయణ, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో నస్పూర్ విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన వారితో మాస్టర్ వెంకటేశ్

నస్పూర్: పెద్దపల్లిలో ఆదివారం నిర్వహించిన అంతర్రాష్ట్ర కరాటే అండ్ కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌– 2023 పోటీల్లో నస్పూర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పి.రితేష్, ఎం.సాయిఈశ్వర్, కె.నిహారిక, ఏ. మన్యు, జి.ఆమనకార్తికేయ, ఎస్.మనీష్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఏ.సాయిఅక్షిత్, జే.శ్రేయాన్‌రెడ్డి వెండి పతకాలు గెలుచుకున్నారు.

కవి సమ్మేళనం



కవితాగానం చేస్తున్న కవి

మంచిర్యాలటౌన్: జిల్లా సాహితీ సంరక్షణ సమితి కవి సమ్మేళనం జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు దండనాయకుల వామన్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మేళనంలో పలువురు కవులు కవితాగానం చేశారు. విభిన్న అంశాలపై పద్య గేయం, వచన, కవితలు వినిపించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు బిజుమళ్ల ఆనంద్‌రావు, సంగీత సాహిత్య సుధావాహిని అధ్యక్షుడు డాక్టర్ దాసరి శ్రీనాథ్‌గౌడ్, సంస్థ ఉపాధ్యక్షుడు బెల్లాల సుగుణాకర్, సంస్థ ప్రచార కార్యదర్శి భూపతి సంతోష్, గొల్లపల్లి బ్రహ్మయ్యచారి పాల్గొన్నారు.

గుర్తింపు మేనిఫెస్టో!



- సాధారణ ఎన్నికలను తలపిస్తున్న సింగరేణి ఎన్నికలు
- గెలుపే లక్ష్యంగా యూనియన్ల ప్రచారం
- పోటా పోటీగా కార్మికులకు హామీలు
- కీలకంగా ఇంటి స్థలం, ఐటీ మాఫీ అంశాలు
- 40 ఏళ్ల తరువాత పరుగు పందెంతో ఉద్యోగాలు!

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తరహాలో యూనియన్లు ప్రచారం నిర్వహిస్తున్నాయి. గెలుపే లక్ష్యంగా కార్మికులకు హామీలు గుప్పిస్తున్నాయి. రాజకీయ పార్టీల తరహాలో మేనిఫెస్టోలు విడుదల చేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో ఐటీ మాఫీ, సొంత ఇంటి స్థలం అంశాలు కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఇక 40 ఏళ్ల తర్వాత సింగరేణిలో ఉద్యోగానికి పరుగు పందెం హామీని కూడా సంఘాలు ఇవ్వడం చర్చనీయాంశమైంది.

కార్మికుల సమస్యలే నాటి ఎజెండా..

సింగరేణిలో 1998లో మొదటిసారి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగాయి. నాడు కార్మిక సంఘాలు చేసిన పోరాటాలు, వారి కమిట్‌మెంట్, సమస్యలపై వారికి ఉన్న అవగాహన గురించి ప్రచారం చేస్తూ ఓట్లు అడిగే వారు. మొదటి రెండు దఫాల ఎన్నికల్లో ఏ కార్మిక సంఘం కూడా మేనిఫెస్టోలు విడుదల చేయలేదు. కేవలం కార్మికుల సమస్యలే ఎజెండాగా ఎన్నికల్లో పోటీ చేశాయి. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరగడంతో ట్రేడ్ యూనియన్లు కూడా రాజకీయ పార్టీల తరహాలో వ్యవహరిస్తున్నాయి. మేనిఫెస్టో విడుదల కూడా ఇందులో భాగమే. ఇప్పుడు గెలుపే లక్ష్యంగా యూనియన్లు హామీలు ఇస్తున్నాయి. మేనిఫెస్టోలు విడుదల చేస్తున్నాయి. ఈనెల 27న జరిగే ఎన్నికల కోసం ప్రధాన కార్మిక సంఘాలన్నీ మేనిఫెస్టో ప్రకటించాయి.

ఏఐటీయూసీ మేనిఫెస్టో...

- అలవెన్సులపై ఆదాయ పన్ను మాఫీ
- సొంత ఇంటి పథకం క్రింద 250 గజాల స్థలం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణం
- నూతన భూగర్భ గనులు, కొత్త ఉద్యోగాలు
- విద్యార్హతను బట్టి కార్మికులకు సూటబుల్ ప్రమోషన్లు
- డబుల్ బెడ్ రూం క్వార్టర్ల నిర్మాణం
- ప్రస్తుతం ఉన్న ఇన్సెంటివ్ స్కీం మెరుగు
- సర్ఫేస్ మజ్దూర్లుగా వెళ్లడానికి అండర్‌గ్రౌండ్ లోని అన్ని కేటగిరీల కార్మికులకు అనుమతి
- మారు పేర్లతో పనిచేసే వారి పేర్లను రెగ్యులరైజ్ చేయడం.
- డిపెండెంట్ల వయస్సు 35 నుంచి 40 ఏళ్లకు పెంపు
- డబ్బులు లేకుండా మెడికల్ బోర్డులో అందరినీ అన్‌ఫిట్ చేయిస్తాం

ఐఎన్టీయూసీ మేనిఫెస్టో..

- బొగ్గు గనుల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం
- కొత్త గనులు, కొత్త ఉద్యోగాలు
- సొంత ఇంటి పథకం క్రింద 250 గజాల స్థలం, రూ.25 లక్షల వడ్డీ లేని రుణం
- అలవెన్సులపై ఆదాయ పన్ను మాఫీ
- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు
- జనరల్ మజ్దూర్లకు క్యాడర్ స్కీం అమలు చేసి వారికి గౌరవమైన డిజిగ్నేషన్
- మహిళా ఉద్యోగులను సర్ఫేస్‌లోనే సర్దుబాటు, రుతుస్రావం సెలవులు
- మారు పేర్ల సమస్యకు పరిష్కారం
- డిపెండెంట్ల వయస్సు 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంపు
- ట్రేడ్స్‌మెన్లకు హెల్పర్ల కేటాయింపు
- మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు

హెచ్ఎంఎస్ మేనిఫెస్టో..

- సింగరేణిలో ప్రధాన సంఘాలు పేర్కొన్న అంశాలతోపాటు హెచ్ఎంఎస్ మరికొన్ని అంశాలను తమ మేనిఫెస్టోలో చేర్చింది.
- 40ఏళ్ల క్రితం అమలైన పరుగు పందెంతో ఉద్యోగాలను తిరిగి పునరుద్ధరిస్తామని పేర్కొంది.

టీబీజీకేఎస్ మేనిఫెస్టో

నాయకత్వ సంక్షోభంలో ఉన్న టీబీజీకేఎస్ గుర్తింపు ఎన్నికల్లో ప్రత్యేకమైన మేనిఫెస్టో విడుదల చేయలేదు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం, గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ సాధించిన హక్కులు, కల్పించిన సదుపాయాలనే యూనియన్ నాయకులు ప్రచారం చేస్తున్నారు. కారుణ్య ఉద్యోగాలు, విద్యుత్ చార్జీల మాఫీ, లాభాల వాటాను 16 శాతం నుంచి 32 శాతంకు పెంపు, క్వార్టర్లకు ఏసీ సౌకర్యం, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, తెలంగాణ స్పెషల్ ఇంక్రిమెంట్ వంటి అనేక హక్కులు, సదుపాయాలు కల్పించామని ప్రచారం చేస్తున్నారు.

అప్పు చేసి వడ్డన



చెన్నూర్ గురుకుల పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

- ఐదు నెలలుగా గురుకులాల డైట్ బిల్లులు పెండింగ్
- క్యాటరింగ్ నిలిపి వేస్తామని నిర్వాహకుల హెచ్చరిక

చెన్నూర్: జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో డైట్ బిల్లులు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో నిర్వాహకులు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వడ్డించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బిల్లులు చెల్లించాలని పలుమార్లు విన్నవించినా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. ఒక్కో పాఠశాలకు నెలకు సుమారు రూ.10లక్షల చొప్పున ఐదు నెలల నుంచి సుమారు రూ.50లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు అప్పులు చేసి అన్నం పెడుతున్నామని, ప్రభుత్వం బిల్లులు చెల్లించని పక్షంలో భోజనం నిర్వహణ నిలిపి వేస్తామని నిర్వాహకులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో పది తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, ఎనిమిది మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 550 నుంచి 600 మంది విద్యార్థుల చొప్పున మొత్తంగా 8,500 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రతీ రోజు విద్యార్థులకు ఉదయం అల్పాహారంతోపాటు రెండు పూటల భోజన సదుపాయం కల్పిస్తున్నారు. నెలకు ఒక్కో పాఠశాలకు రూ.10లక్షల బిల్లు అవుతుంది. గత ఐదు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఒక్కో నిర్వాహకునికి సుమారు రూ.40లక్షల నుంచి రూ.50లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



ఐదు నెలల నుంచి డైట్ బిల్లులు అందక చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈ నెలాఖరు నాటికి బిల్లులు ఇవ్వకుంటే క్యాటరింగ్ నిలిపివేస్తాం. పలుమార్లు జిల్లా అధికారులకు చెప్పాం. ఈ నెల వచ్చే నెల అంటూ ఐదు నెలలు కావస్తోంది. ఇప్పటికే రూ.లక్షల్లో అప్పులు చేశాం. విద్యార్థులు ఇబ్బందులు పడద్దని అప్పులు చేసి అన్నం పెడుతున్నాం. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వచ్చేలా చూడాలి.

– గుర్రం మహేందర్, చెన్నూర్ గురుకుల పాఠశాల డైట్ నిర్వాహకుడు

ఈ నెలాఖరు నాటికి వస్తాయి..



ఎన్నికల సందర్భంగా బిల్లులు ఆగిపోయాయి. జిల్లాలోని 50 శాతం మందికి ఒక్క నెల బిల్లులు వచ్చాయి. నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం. బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. ఈ నెలాఖరు నాటికి పెండింగ్ బిల్లులు క్లియర్ అయ్యేలా చూస్తాం.

– స్వరూపరాణి, ఆర్సీవో, ఆదిలాబాద్

బీసీల కోసం ఉద్యమించిన నేత పెరియార్

పాతమంచిర్యాల: దేశంలో బీసీలు, బడుగు బలహీనవర్గాల కోసం వందేళ్ల క్రితమే ఉద్యమాలు నడిపిన మహోద్యమకారుడు పెరియార్ రామస్వామి నాయకర్ అని బహుజన సంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో పెరి యార్ రామస్వామి 50వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్ మాట్లాడుతూ స్వార్థపర శక్తులు సృష్టించిన మనువాద భావజాలానికి వ్యతిరేకంగా పెరియార్ 1927లోనే ఉద్యమాలు చేశారన్నారు. నాడు ప్రభుత్వ ఉద్యోగాలలో వంద శాతం బ్రాహ్మణులకే రిజర్వేషన్లు ఉండేవని, ఆయన కృషితో 1960లో బీసీ వర్గానికి చెందిన అన్నాదురై, కరుణానిధి తమిళనా డులో ముఖ్యమంత్రులు అయ్యారని, కేరళ, తమిళనాడులో బీసీలు ఎస్సీలు అర్చక వృత్తులకు అర్హత సాధించారన్నారు. పెరియార్ చూ పిన ఆత్మాభిమా న ఉద్యమాల ఆశయాలను బహుజనులు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, సామాజిక ఉద్యమకారులు కామిల్ల జయరావు, జనా ర్దన్, మోతె రామదాసు, లక్ష్మణ్, సోమన్న, భారత నాస్తిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజసమ్ములు, మే రు సంఘం నాయకులు మాడిశెట్టి సత్యనారయణ, కురుమ సంఘం నాయకులు సమ్ము రాజన్న, వేముల కిరణ్, మల్యాద్రి నారాయణ, బుర్ర వెంకటేశ్, గోర్కటి సురేశ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

మంచిర్యాలటౌన్: విద్యాశాఖలో పదేళ్లుగా అమలవుతున్న నిరంతర సమగ్ర మూల్యాంకనం(సీసీఈ) విద్యాభివృద్ధికి తీవ్ర అవరోధంగా ఉందని, దీనిపై విద్యాశాఖ అధికారులు పునఃసమీక్ష చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యులు కోరారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, రవికుమార్ మాట్లాడారు. సీసీఈ విధానంలో విపరీతమైన రాతపని కారణంగా చదువులో విద్యార్థులు వెనుకబడుతున్నారని తెలిపారు. హాజరుశాతం తగ్గి, విద్యాభివృద్ధిపై ప్రభావం చూపుతోందన్నారు. కరోనాతో సంక్షోభానికి గురైన విద్యా వ్యవస్థ ఇంకా కోలుకోవడం లేదని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాల అమలులో విద్యాబోధన సత్ఫలితాలను ఇవ్వదని, అధి కారులు అడుగుతున్న మోస్ట్ అర్జంట్ రిపోర్టులు, జూమ్ సమావేశాలు విలువైన విద్యా సమయాన్ని హరిస్తున్నాయని వివరించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా మంత్రి సీతక్క



మంత్రి సీతక్క

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు చేశారు. ఇన్‌చార్జి మంత్రిగా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పథకాలు, పాలన తీరుపై సమీక్షలు, సమావేశాల నిర్వహణ, ప్రజాపాలనపై పర్యవేక్షణ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో జరిగే ప్రభుత్వ వ్యవహారాలన్నీ సమన్వయం చేస్తారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆమె ఇన్‌చార్జి మంత్రిగా రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం ఎస్టీ రిజర్వు కావడంతో ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన ములుగు ఎమ్మెల్యే సీతక్కను జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వ్యవహరించారు.

చిగురిస్తున్న 'రేషన్' ఆశలు..!

- కొత్త కార్డుల జారీకి ప్రభుత్వం కసరత్తు
- పెండింగ్‌లో వేలాది దరఖాస్తులు
- అన్ని పథకాలకు రేషన్‌కార్డుతోనే లింకు



రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

మంచిర్యాలటౌన్: కొత్త రేషన్ కార్డుల జారీపై అర్హుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్న వారి నిరీక్షణ ఫలించే సమయం ఆసన్నమైంది. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా జారీ చేయలేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుల మంజూరుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 28 నుంచి దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత అన్ని అర్హతలు ఉండి రేషన్ కార్డులు రాని వారు తమ సమస్యను చెప్పుకునేందుకు గ్రామసభలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

స్పష్టత వస్తేనే..

గత ప్రభుత్వం 2018, అక్టోబర్ 4 నుంచి నూతన రేషన్ కార్డుల జారీకి అందించేందుకు దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించింది. దీంతో జిల్లాకు చెందిన 14,459 మంది మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ శాఖ ద్వారా ఆయా దరఖాస్తులను పరిశీలించి జిల్లా పౌరసరఫరాల శాఖకు పంపించారు. అందులో జిల్లా పౌరసరఫరాల శాఖ 10,400 దరఖాస్తులను అప్రూవ్ చేయగా, 3,318 దరఖాస్తులను రిజెక్ట్ చేసింది. ఆ తరువాత వెబ్‌సైట్ క్లోజ్ చేశారు. అర్హులకు కార్డులు జారీ చేయకపోగా, కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. దరఖాస్తుల స్టేటస్ ఏమిటో కూడా తెలియని పరిస్థితి. ఏళ్లు గడిచినా కార్డులు జారీ కాకపోవడంతో దరఖాస్తుదారులు ఇక ఆశలు వదులుకున్నారు. కొత్త ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీకి దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించింది. అయితే గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మరోసారి చేసుకోవాలా వద్దా, చేసుకోని వారికే అవకాశం ఇస్తారా వంటి అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

రేషన్ కార్డుతోనే పథకాలు..

ప్రభుత్వం అన్ని పథకాలకు రేషన్ కార్డునే అర్హతగా పరిగణిస్తున్నాయి. ఆరోగ్యశ్రీతోపాటు, ప్రభుత్వం నుంచి అందించే పలు పథకాలకు రేషన్ కార్డు ఉంటేనే ఎంపిక చేస్తున్నారు. ప్రస్తుతం రూ.500లకు గ్యాస్ సిలిండర్‌తోపాటు చేయూత పథకంలో మహిళలకు నెలనెలా అందించే రూ.2,500లను కూడా రేషన్ కార్డు తప్పనిసరి చేస్తారని తెలుస్తోంది. దీంతో రేషన్‌కార్డు లేని అర్హులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలోని రేషన్ షాపులు, కార్డుల వివరాలు

జిల్లాలోని రేషన్ షాపులు	423
ఆహార భద్రత కార్డులు	2,03,594
అంత్యోదయ కార్డులు	15,489
అన్నపూర్ణ కార్డులు	160
మొత్తం రేషన్ కార్డులు	2,19,243

ప్రభుత్వ ఆదేశాల మేరకే..



గతంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించిన నిబంధనలతోపాటు, కొత్త కార్డుల కోసం దరఖాస్తులపై ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, నిబంధనల ప్రకారం కార్డుల జారీ ఉంటుంది. కార్డుల్లో పేర్ల చేర్పు సైతం నిబంధనల ప్రకారమే చేపడతాం.

– ప్రేమ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

సీఎంకు కానుకగా ఐఎన్టీయూసీ గెలుపు!

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు
- సీసీసీలో యూనియన్ జనరల్ బాడీ సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. సీసీసీలో ఐఎన్టీయూసీ జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సింగరేణిలో శ్రీరాంపూర్ అతిపెద్ద ఏరియా అని, ఇక్కడ మెజారిటీ తెచ్చి సింగరేణిలో ఐఎన్టీయూసీని గుర్తింపు సంఘంగా గెలిపించాలని కోరారు. కార్మికులకు తాను అండగా ఉంటానని, ప్రతీనెల 2, 4వ ఆదివారం కార్మికుల కోసమే కేటాయిస్తానని హామీ ఇచ్చారు. సింగరేణి సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులు ఇక్కడే ఖర్చు చేయిస్తానని తెలిపారు. మేనిఫెస్టోలో పెట్టినట్లుగా కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయిస్తానని, రూ.25 లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తామని వెల్లడించారు. కొత్త గనులు తీసుకువచ్చే బాధ్యతమాదే అన్నారు. పర్మినెంట్ కార్మికులకు ఇస్తున్నట్లుగానే రిటైర్డ్ కార్మికులకూ సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. కమ్యూనిస్టులు మన సోదరులేనని, అయితే కార్మికుల సమస్యల పరిష్కారానికి వారి బలం సరిపోదన్నారు. ఇకపై సింగరేణిలో రాజకీయ జోక్యం ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్, బ్రాంచీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేన శ్యాం, గరిగే స్వామి, జాతీయ సభ్యులు భీంరావు, పీసీసీ కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బండారి సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ల వేణు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, ఐఎన్టీయూసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి ఐఎన్టీయూసీలో చేరారు.

27న ఈపీఎఫ్ శిబిరాలు

మంచిర్యాలటౌన్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ప్రాంతీయ కార్యాలయం కరీంనగర్‌కు చెందిన అధికారులు ఈనెల 27న ఈపీఎఫ్ లబ్ధిదారుల సమావేశాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సెల్వట్కర్ తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు ఉమ్మడి జిల్లాలో నిర్వహించే సమావేశాలను ఆయా జిల్లాల పరిధిలో ఉన్న పీఎఫ్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంచిర్యాలలో మున్సిపల్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డీఆర్డీఏ కాన్ఫరెన్స్ హాల్‌లో, నిర్మల్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ శిబిరంలో ఈసీఆర్, ఇతర రాబడులు, కేవైసీ సీడింగ్, సభ్యుల వివరాల దిద్దుబాటు, అప్‌డేట్, ప్రధాన యజమానులు, కాంట్రాక్టర్లు, యూఏఎన్ జనరేషన్, యాక్టివేషన్ వంటి సేవలు అందిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

లక్సెట్టిపేట(మంచిర్యాల): తాటిచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం చందారం గ్రామానికి చెందిన వెంకాగౌడ్(62) ఊత్కూరులో నివాసముంటూ గీత కార్మికుడిగా జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. గమనించిన స్థానికులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని కుమార్తె మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

భీమారం: మండలంలోని ఆరెపల్లి సమీపంలోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. తాండూరు మండలం బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన జిట్టవేని దుర్గయ్య బైక్‌పై ఆదివారం మద్దికల్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరుగుప్రయాణంలో బైక్ అదుపుతప్పి రోడ్డు కిందకి దూసుకెళ్లడంతో దుర్గయ్య ముఖానికి తీవ్రగాయాలయ్యాయి.

చికిత్స పొందుతూ కాంగ్రెస్ కార్యకర్త మృతి

నెన్నెల(బెల్లంపల్లి): ఆటో అదుపుతప్పి కిందపడిన ఘటనలో గాయాలపాలైన కాంగ్రెస్ కార్యకర్త చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని నందులపల్లి గ్రామానికి చెందిన బద్ది రమేశ్ (47) నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బొప్పారం ఓటర్లను నెన్నెల పోలింగ్ కేంద్రానికి తీసుకువస్తుండగా సబ్‌స్టేషన్ సమీపంలో ఆటో అదుపుతప్పి కిందపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. భూమి తాకట్టు పెట్టి రూ.4 లక్షలు ఖర్చు చేసి వైద్యం చేయించినా ఫలితం లేకుండా పోయిందని, తమ కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే ఆదుకోవాలని మృతుని భార్య సత్తమ్మ వేడుకుంటోంది.


పెన్‌గంగలో వ్యక్తి గల్లంతు

సిర్పూర్(టి): గంగస్నానానికి వచ్చి పెన్‌గంగలో వ్యక్తి గల్లంతైనట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..చింతలమానెపల్లి మండల కేంద్రానికి చెందిన చౌదరి మారుతి(50), భార్య వనితతో కలిసి ఆదివారం సాయంత్రం సిర్పూర్(టి) మండలం టోంకినిలోని శ్రీ సిద్ధిటోంకిని హనుమాన్ ఆలయ దర్శనానికి వచ్చారు. గంగస్నానం చేసేందుకు మారుతి పెన్‌గంగ నదిలోకి వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు.

క్రిస్మస్ కాంతులు!

- వేడుకలకు ముస్తాబైన క్రైస్తవాలయాలు
- జిల్లా వ్యాప్తంగా విద్యుత్ దీపాలతో అలంకరణ
- పర్యాటకులను ఆకర్షిస్తున్న లక్సెట్టిపేట సీఎస్ఐ చర్చి
- రాష్ట్రంలో రెండో అతిపెద్ద ప్రార్థనా మందిరం

క్రిస్మస్ వేడుకలకు జిల్లాలోని క్రైస్తవాలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని వివరించేలా చర్చీల ఆవరణలో ప్రత్యేక సెట్టింగులు వేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం సాయంత్రం నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రముఖ చర్చీల ప్రాశస్త్యంపై ప్రత్యేక కథనం.


మిషన్ కాంపౌండ్‌లోని సీఎస్ఐ చర్చి

చరిత్రకు సజీవ సాక్ష్యం..

లక్సెట్టిపేట(మంచిర్యాల): తెలంగాణ రాష్ట్రంలో మెదక్ తర్వాత రెండో అతిపెద్ద చర్చిగా చెప్పుకునే లక్సెట్టిపేట సీఎస్ఐ చర్చి జిల్లాలోని చారిత్రక కట్టాడాలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన చర్చి కావడంతో 88 వసంతాలు పూర్తి కావస్తున్నా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఏటా క్రిస్మస్‌కు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి ప్రార్థనలు చేస్తారు.

చర్చి వివరాలు

1920లో ఇంగ్లాండ్ దేశస్థుడైన ఈడబ్ల్యూలాంట్ లక్సెట్టిపేటకు వచ్చాడు. అతను ఏసుక్రీస్తును ఆరాధించేవాడు. పది సంవత్సరాల పాటు మిషనరీ సంస్థలో మిషనరీగా పనిచేశాడు. ఇక్కడ చర్చి నిర్మాణం చేపట్టాలని అనుకున్నాడు. ఇంగ్లాండ్ నుంచి ప్లాన్ తెప్పించాడు. 95 ఫీట్ల వైశాల్యం, 45 ఫీట్ల వెడల్పు, ప్రాంగణ వైశాల్యం 70 ఫీట్లు, గొలుసులతో ఉన్న దిమ్మెలు 46, స్థల వసతి సుమారు 500 మందికి సరిపడా చర్చి నిర్మాణ ప్లాన్‌తో లక్సెట్టిపేటకు రెండు కిలోమీటర్ల దూరంలో 1930లో శంకుస్థాపన చేసి చర్చి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇంగ్లాండ్ నుంచి రంగురంగుల అద్దాలు తెప్పించాడు. సమీపంలో ఉన్న గూడెంగుట్ట, గువ్వలగుట్ట, చిన్నయ్య గుట్టల నుంచి రాళ్ళు తెప్పించాడు. నిర్మాణానికి సమీప బొట్లకుంటలోని నీటిని ఉపయోగించారు. మహారాష్ట్ర నుంచి శిల్పకళాకారులను రప్పించారు. నిర్మాణం పనులు జరుగుతుండగా వేసవి కాలం కావడంతో ఇక్కడి వాతావరణం అనుకూలించక అర్లీ దొర వడదెబ్బకు గురికావడంతో ఇంగ్లాండ్ వెళ్లిపోయారు. కొద్దిరోజులకు ఇంగ్లాండ్ నుంచి హెచ్‌బర్డ్ ఇక్కడకు వచ్చారు. 1935లో నిర్మాణ పనులు పూర్తి చేయించారు. అనంతరం ఇక్కడకు మిషనరీగా వచ్చిన రెవ ఫాస్నూట్ సీఎస్ఐ చర్చిగా నామకరణం చేసి 1935 డిసెంబర్ 25న ప్రారంభించారు.

విజయనగరం చర్చికి 61 ఏళ్లు..


ముస్తాబైన విజయనగరం చర్చి

కౌటాల: కౌటాల మండలం విజయనగరం గ్రామంలోని క్యాథలిక్ చర్చికి 61 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. 1962లో ఈ చర్చిని స్థాపించారు. విశాలమైన ప్రాంతంలో చర్చితో పాటు ఎయిడెడ్ పాఠశాల, వసతి గృహం ఉన్నాయి. ప్రతీ ఆదివారం 250 మందికి పైగా భక్తులు వచ్చి ప్రార్థనలు నిర్వహిస్తారని చర్చి ఫాదర్ సీజో తెలిపారు. 33 ఏళ్ల క్రితం పాత భవనాన్ని తొలగించి అదే స్థలంలో భారీ నూతన మందిరం నిర్మించారు. ఏటా క్రిస్మస్ రోజు వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు.

బొగ్గుగనుల పుట్టుకతో ఏర్పడిన సీఎస్ఐ చర్చి


బెల్లంపల్లిలోని సీఎస్ఐ చర్చి

బెల్లంపల్లి: కార్మిక క్షేత్రం బెల్లంపల్లిలోని చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) చర్చికి దశాబ్దాల చరిత్ర ఉంది. బెల్లంపల్లిలో బొగ్గు గనుల తవ్వకాలు మొదలయ్యాక చర్చి ఏర్పాటైంది. 1954 ఫిబ్రవరి 21న ఇంగ్లండ్‌కు చెందిన రెవరెండ్ డాక్టర్ డబ్ల్యూఈ సంగస్టర్ అనే క్రైస్తవుడు చర్చి నిర్మాణానికి భూమిపూజ చేయగా 1958లో ఇంగ్లండ్‌కు చెందిన రెవరెండ్ నోయల్ బ్రూయిస్ మిషనరీగా వచ్చి చర్చిని లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో పెళ్లి చేసుకున్న నవ దంపతుల సంసార జీవనం నిండునూరేళ్లు సాఫీగా సాగుతుందనే విశ్వాసం క్రైస్తవ సమాజంలో పెనవేసుకుంది. 1954 వరకు ఆంగ్లేయులు చర్చి ఫాదర్లుగా విధులు నిర్వహించారు. వారి కోసం అందమైన బంగ్లాను నిర్మించుకున్నారు. పశువుల పాకలో ఏసుక్రీస్తు జన్మించాడని ఏటా డిసెంబర్‌లో చర్చి ఆవరణలో పశువుల పాక నిర్మాణం చేపడుతారు.

ఫాదర్ నివాస గృహం...

చర్చి ఫాదర్ నివాసం ఉండేందుకు ఆంగ్లేయులు అప్పటి రోజుల్లో విశాలమైన రెండతస్తుల భవనం నిర్మించారు. విశాలమైన గదులు, చుట్టూ చెట్లు, ఆరుబయట ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రాచీన కట్టడాల్లో కొత్తగా కనిపించే ఫాదర్ నివాస గృహం చూడముచ్చటగా ఉంటుంది.

చెన్నూర్ చర్చికి 50 ఏళ్లు..

చెన్నూర్: పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో 1974లో పాస్టర్లు డనియాల్, ఆనంద రావు, తంబిరాజు ఆధ్వర్యంలో ఐఈఏం, క్రిష్టియన్ మిషన్ చర్చిని నిర్మించారు. 50 ఏళ్ల నుంచి చర్చిలో ప్రతి ఆదివారం వందలాది మంది క్రైస్తవులు ప్రార్థనలు చేస్తారు. క్రిస్మస్ వేడుకలకు రెండు రోజుల ముందు నుంచే ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని పాస్టర్ సత్యరాజ్ తెలిపారు. ఏసుక్రీస్తు పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం ఉదయం 10:30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు, సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పాస్టర్ తెలిపారు.


చెన్నూర్‌లో ముస్తాబైన క్రిస్టియన్ మిషన్ చర్చి

ఆకట్టుకుంటున్న 'క్రిబ్'

రామకృష్ణాపూర్: పట్టణంలోని శివాజీనగర్ ఏరియాలో సింగరేణి ఉద్యోగి మ్యాథ్యు శ్యాంసన్ ఇంట్లో ఏర్పాటు చేసిన క్రిబ్(పశువుల పాక)సెట్టింగ్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఏసుక్రీస్తు జననాన్ని తెలిపే విధంగా రూపొందించిన ఈ పశువుల పాకలో బాల ఏసు, మరియ, జోసెఫ్, పశువుల పాక, బెత్లహేము గ్రామ నమూన, హేరోదు రాజు కోట సెట్టింగ్‌లు ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంటున్నాయి.


బెత్లహేము గ్రామ ముఖచిత్రం

విద్యుత్ కాంతుల్లో కల్వరి చర్చి


సోమగూడెంలోని కల్వరి చర్చి

కాసిపేట: క్రిస్మస్ వేడుకలకు మండలంలోని సోమగూడెం, ముత్యంపల్లి, దేవాపూర్, ధర్మరావుపేట, కాసిపేట గ్రామాల్లో చర్చీలను ముస్తాబు చేశారు.

15 నిమిషాల్లో పోగొట్టుకున్న బంగారం పట్టివేత

జైపూర్: జైపూర్ నుంచి కుందారానికి ఆటోలో వెళ్తున్న ఓ బాధిత మహిళ షెట్‌పల్లి వద్ద బ్యాగు పోగొట్టుకుంది. అందులో రూ.2.50 లక్షల విలువైన 4 తులాల బంగారం, సెల్‌ఫోన్ ఉన్నాయి. కేవలం 15 నిమిషాల్లోనే జైపూర్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చెన్నూర్ మండలం రాయపేటకు చెందిన దుర్గం లక్ష్మి..జైపూర్ మండలం కుందారంలోని కొమురవెల్లి మల్లన్నస్వామిని దర్శించుకునేందుకు ఆదివారం బస్సులో బయల్దేరింది. జైపూర్‌లో దిగి కుందారం వెళ్లేందుకు ఆటో ఎక్కింది. షెట్‌పల్లి వద్ద ఆమె బ్యాగు రోడ్డుపై పడిపోయింది. కొంతదూరం వెళ్లాక బ్యాగు కనిపించక పోవడంతో ఆందోళన చెంది దారిలో వెతకగా దొరకలేదు. వెంటనే జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై ఉపేందర్‌రావు వెంటనే ఆమె ఫోన్‌ను ట్రేస్‌చేసి బ్యాగును పట్టుకుని లక్ష్మికి అప్పగించారు. పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.


లక్ష్మికి బంగారం, బ్యాగు అప్పగిస్తున్న పోలీసులు

ప్రమాదవశాత్తు ట్రాక్టర్, వరిధాన్యం దగ్ధం

చింతలమానెపల్లి(సిర్పూర్): మండల కేంద్రంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ట్రాక్టర్, వరిధాన్యం దగ్ధమయ్యాయి. మండల కేంద్రానికి చెందిన రైతు విలాసాగర్ సత్తయ్య తన వరి పంట నూర్పిడి కోసం స్థానికంగా ఉన్న వీరయ్యకు చెందిన ట్రాక్టర్ క్రషర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. పంట నూర్పిడి చేస్తుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ ఇంజన్ లోంచి మంటలు వచ్చి ట్రాక్టర్ దగ్ధమైంది. మంటలు వరి గడ్డకు వ్యాపించడంతో వరిధాన్యం కాలిపోయింది. సుమారు 15 క్వింటాళ్ల వరి ధాన్యం కాలిపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.


దగ్ధమైన ట్రాక్టర్

అ'పూర్వ' సమ్మేళనం


చెన్నూర్ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల పూర్వ విద్యార్థులు

చెన్నూర్: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో 2002 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు 21 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. పాఠశాలలో ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఒకటవ తరగతి నుంచి కలిసి చదువుకున్న మిత్రులందరూ హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ (బాయ్స్)లో 1990–91 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వవిద్యార్థులు ఒకచోట కలిశారు. శ్రీ మంజునాథ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో వీరు పాల్గొన్నారు. గత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. అందరూ కలిసి భోజనం చేశారు.


మందమర్రి పట్టణంలో జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు మృతి


కంపెల ప్రశాంత్ (ఫైల్)

భీమారం: మండలంలోని పోలంపల్లి సమీపంలో మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిపై ఆదివారం ఎదురెదురుగా రెండు బైక్‌లు వేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై రాజవర్ధన్ కథనం ప్రకారం.. వేమనపల్లి మండల కేంద్రానికి చెందిన కంపెల ప్రశాంత్ (24) మంచిర్యాలకు స్కూటీపై వస్తున్నాడు. మంచిర్యాల నుంచి కొట్టవాడ మహేశ్ బైక్‌పై తన స్వగ్రామమైన మహారాష్ట్రలోని సిరొంచకు వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రశాంత్ అక్కడికక్కడే మృతిచెందగా మహేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై సంఘటన స్థలానికి చేరుకున్నారు. మహేశ్‌ను అంబులెన్స్‌లో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి ఉద్యోగికి డాక్టరేట్


డాక్టరేట్ సర్టిఫికెట్‌తో ఆరుముల్ల రాజు

నస్పూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన ఆరుముళ్ల రాజు సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఢిల్లీలోని వర్సిటీలో శనివారం జరిగిన కార్యక్రమంలో అధికారులు ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. రాజు..భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో వార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో 2013లో సెవన్ స్టెప్స్ యూత్ క్లబ్ స్థాపించారు. 2018లో సింగరేణిలో ఉద్యోగంలో చేరి తదనంతరం సింగరేణి మజ్దూర్ అసోసియేషన్ స్థాపించి కార్మికుల కోసం వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. వీటిని గుర్తించిన సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా రాజును పట్టణవాసులు అభినందించారు.

'విప్లవ సంఘాల కూటమిని గెలిపించాలి'


మాట్లాడుతున్న సంజయ్ సింగ్వీ

పాతమంచిర్యాల: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో విప్లవ సంఘాల కూటమిని గెలిపించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్ సింగ్వీ, తెలంగాణ గని కార్మిక సంఘం (టీయూసీఐ అనుబంధం) రాష్ట్ర నాయకులు సుధాకర్, బి.సదానందం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులపై పనిభారం మోపడంలో యాజమాన్యానికి కార్మికసంఘాలు తోడ్పడ్డాయన్నారు. సంస్థలో జరుగుతున్న ప్రైవేటీకరణ, అవుట్ సోర్సింగ్‌కు పరోక్షంగా మద్దతు పలుకుతూ చట్టబద్ధమైన వేతనాలు చెల్లించకుండా కాంట్రాక్టు కార్మికులను సైతం దోపిడీకి గురిచేసిన సంఘటనలో జాతీయ సంఘాల పాత్ర ఉందన్నారు.

నేతకానీలు ఐక్యంగా ఉండాలి

భీమారం: నేతకానీలు ఐక్యంగా ఉండాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నేతకాని మహార్ బంధువుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో నేతకానీలు రాజకీయంగా ఎదగాలన్నారు. చట్టసభల్లో అడుగుపెట్టి తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఎస్సీ ఉపకులాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామనేని లక్ష్మణ్, బీజేపీ మండల మహిళా అధ్యక్షురాలు మేడి విజయ, నాయకులు దుర్గం రాములు, కోట రాజేష్, గజ్జల నరేశ్ పాల్గొన్నారు.

గెలిచిన వాళ్లు నష్టమే చేశారు

శ్రీరాంపూర్: సింగరేణిలో ఇప్పటి వరకు గుర్తింపు సంఘంగా గెలిచిన వాళ్లు కార్మికులకు నష్టమే చేశారని విప్లవ కార్మిక సంఘాల కూటమి నాయకులు అన్నారు. ఆదివారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు వచ్చిన తర్వాత కార్మికుల హక్కులు హరించబడ్డాయన్నారు. కోడ్ ఆఫ్ డిసిప్లేన్ మార్చకుండా ఎంత కాలం ఎన్నికలు జరిగినా కార్మికులకు నష్టమే తప్ప లాభం జరగదన్నారు. గెలిచిన సంఘాలు యాజమాన్యానికి తొత్తులుగా మారి కార్మికుల గొంతు నొక్కుతున్నాయన్నారు. ఇప్పటివరకు సింగరేణిలో జరిగిన ప్రైవేటీకరణ, తగ్గిన ఉద్యోగాలకు కారణం ఈ సంఘాలే అన్నారు. ఈ సంఘాలకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, కార్మికులు విజ్ఞతతో ఆలోచించి చక్రంలో సుత్తిగుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టీ.శ్రీనివాస్, ఎస్‌జీఎల్ బీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములు, టీజీఎల్ బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి పోతుల కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కూటమి నాయకులు

'ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలి'

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపిస్తే మైనింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కారం అవుతాయని యూనియన్ మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ బెల్లంపల్లి రీజియన్ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పదేళ్లుగా మైనింగ్ స్టాఫ్ కార్మికులతో సతమతమవుతున్నారన్నారు. మైనింగ్ స్టాఫ్ అనేక పోరాటాలు చేసి హక్కులు సాధించుకుందన్నారు. సమావేశంలో అసోసియేషన్ శ్రీరాంపూర్ ఇన్‌చార్జి మారుపల్లి బాబు, మందమర్రి ఇన్‌చార్జి గోపతి సత్యనారాయణ, నాయకులు బాలకృష్ణ, పారుపల్లి రాజేందర్, రామోజీ, క్రాంతి కిరణ్, రాజశేఖర్, చంద్రశేఖర్, సదయ్య, రంజిత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మైనింగ్ స్టాఫ్ సబ్‌కమిటీ నాయకులు

సింగరేణికి పూర్వవైభవం తెస్తాం

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్: ఈ ఎన్నికల్లో తాము గెలిస్తే సింగరేణికి పూర్వవైభవం తీసుకువస్తామని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. ఆదివారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకూ గెలిచిన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్ పైరవీకారి సంఘాలేనని, వీటిని ఎన్నికల్లో ఓడించాలన్నారు. సింగరేణిలో హెచ్‌ఎంఎస్ గెలిస్తే సొంతింటి పథకం అమలు చేస్తామని, కొత్తగా ఐదు భూగర్భగనులను తీసుకువస్తామని, పరుగు పందెం పోటీలు నిర్వహించి కొత్త ఉద్యోగాలు కల్పిస్తామని, అలవెన్స్‌లపై ఆదాయ పన్ను మాఫీ చేయిస్తామన్నారు. తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీటరి రాజయ్య మాట్లాడుతూ సింగరేణిలో హెచ్‌ఎంఎస్‌కు తమ సంఘం మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, నాయకులు బోనాల శ్రీనివాస్, రాజబాబు, నామాల శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శేజల్ మరోసారి ఆందోళన

- మాజీ ఎమ్మెల్యే అనుచరులపై కేసు నమోదు చేయాలి
- ఏసీపీ కార్యాలయం ఎదుట నిరసన

బెల్లంపల్లి: తనపై దాడి చేసిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అనుచరులపై కేసు నమోదు చేయాలని ఆరిజిన్ డెయిరీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి (సీఏఓ) బోడపాటి శేజల్ మరోసారి ఆందోళన చేసింది. ఆదివారం బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయం ప్రధాన ద్వారం ముందు బైఠాయించి గంటపాటు నిరసన తెలిపింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బెల్లంపల్లికి వచ్చిన తనపై మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అనుచరులు, బీఆర్ఎస్ శ్రేణులు కొందరు దాడికి పాల్పడి హత్యాయత్నం చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై ఇటీవల వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకుండా పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. పోలీసులు తీరు సరికాదని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే అనుచరులపై కేసు నమోదు చేసి జైలుకు పంపించేవరకు తన పోరాటం సాగుతుందని ఆమె స్పష్టం చేశారు.


బైఠాయించి నిరసన తెలుపుతున్న శేజల్